# అనుబంధాలు

"ఏం తాతా ఇంటికి వెళ్ళవా? చీకటి పడింది - యిక్కడే కూర్చున్నావ్ !" గుడికి తాళం వేసి మెట్లుదిగుతూ అడిగాడు చిన్నపూజారి.

పరధ్యానంలో వున్న పరంధామయ్య ఉలిక్కిపడ్డాడు.

తను ఆలయంకు కొంచెం దూరంలోని రాతి అరుగుమీద కూర్చుని ఉన్నాడు. చీకట్లు ముదిరిపోవడం గమనించనే లేదు.

శూన్యంగా అతనివంక చూశాడు.

"వర్షం కూడ వచ్చేట్లు ఉంది. తొందరగా ఇంటికి వెళ్ళిపో!" సైకిలు తీసుకుని వెళుతూ చివరి హెచ్చరిక చేశాడు అతను.

పరంధామయ్య పైకి చూశాడు. నక్షత్రాలు కనపడలేదు. ఆకాశమంతా నల్లగా ఉంది. గాలి స్థంభించిపోయింది. ఏదో తెలియని అశాంతి వాతావరణంలో తన మనసులో లాగా.

అయిష్టంగానే కాలు ముందుకు కదిపాడు.

కొంచెం దూరం నడిచాడో లేదో - ఆకాశానికి చిల్లుపడినట్లు కుండపోత వర్షం ప్రారంభమయింది.

రోడ్డుమీద నడుస్తున్న పరంధామయ్య తలదాచుకోవడం కోసం చుట్టూతా చూశాడు- నిర్మానుష్యంగా వున్న రోడ్డుమీద ఎక్కడా పెద్దచెట్లుకాని - బస్సు షెల్టర్లు కాని లేవు. కొంచెం పక్కగా కాంపౌండు వాలు లేని ఇల్లు - యింటి వసారా కన్పిస్తున్నాయి.

పరంధామయ్య పరుగెత్తుకుంటూ వెళ్ళి ఇంటిచూరుక్రింద వసారాలో నిల్చున్నాడు-- బాల్కనీ ముందుకు పొడుచుకు వచ్చి ఉండటం వలన నెత్తిమీద వర్షం పడటం లేదు. కాని గాలికి తుంపర్లు అప్పుడప్పుడు లోపలికి పడుతున్నాయి. అప్పటికే పరంధామయ్య తడిసిపోయాడు. చలికి వణుక్కుంటూ ముణగదీసుకుని ఇంటి అరుగుమీద కూర్చున్నాడు.

ఇంటిలోపల నుంచి టీవీ పెద్ద సౌండుతో మోగుతున్నది.

నిమిషాలు గంటల్లా గడిచి పోతున్నాయి. ఇంటికి పోదాం అంటే వర్షం కొంచెం కూడ తెరిపి యివ్వడం లేదు. అటువైపు ఖాళీ ఆటోలు రావడమే లేదు. దిక్కుతోచడం లేదు. ఎంతసేపని యిలా పరాయిపంచన ఉండగలడు? రాత్రి పదిదాటి ఉంటుంది- అలానే తడుచుకుంటూ పోతే ఓ పదిహేను నిమిషాల్లో యింటికి చేరుకోవచ్చు. రోడ్డుమీద అప్పుడే వాన నీటి ప్రవాహాలు మొదలయ్యాయి.

ధైర్యం చేసి నాలుగు అడుగులు ముందుకు వేశాడు - సూదుల్లా వర్షం శరీరాన్ని తాకుతున్నది - ఈలోగా కరెంటు ఆగిపోయింది. గాఢాంధకారం అలుముకుంది.

కన్నుపొడుచుకున్నా ముందేముందో కానరాని చీకటి. పరంధామయ్య భయపడిపోయి వెనక్కి పరుగెత్తుకుంటూ వచ్చి వసారాకింద నిలబడ్డాడు.

ధబ ధబ మని అతని అడుగుల చప్పుడు బరువుగా వస్తున్న ఉచ్ఛ్వాసనిశ్వాసాలు లోపలివారికి వినిపించాయి.

"ఎవరది? ఎవరక్కడ? " ఒక స్త్రీ కంఠం గట్టిగా ప్రశ్నించింది లోపలినుండి.

పరంధామయ్య మౌనం దాల్చాడు.

ఇంటిలోపల నుంచి తిరిగి అదే ప్రశ్న - "ఎవరది?"

" నేను.... వర్షానికి తడిసిపోతూంటే - తలదాల్చుకున్నాను - " పరంధామయ్య చెప్పాడు చిన్నగా.

" హూ ! అడ్డమైన వాళ్ళందరికి మా వసారా ఆసరా అవుతున్నది - కాంపౌండు వాలు కట్టించుకోక పోవడం మేం చేసిన తప్పు." ఒక స్త్రీ స్వగతంగా గొణుక్కుంది.

" క్యాండిల్సు వెలిగించండి - ఈ కరెంటు యిప్పుడే పోవాలా?"

" లేవు - ఈమధ్య తీసుకురాలేదు - "

" అరే ! ఏం మనుష్యులు - బ్యాటరీ లైటు వెలిగించండి - " ఆ స్త్రీ గాభరా పడుతూ అడుగుతున్నది.

"సడెన్‌గా బ్యాటరీ లైటు దొరకమంటే ఎక్కడ దొరుకుతుంది?" ఒక మొగ కంఠం కరుగ్గా అంది.

" అమ్మా ! దొరికింది కాని - వెలగడం లేదు - " ఓ పిల్లాడు చెబుతున్నాడు.

" ఛీ దరిద్రం ! ఇంట్లో దొంగలు దూరినా దిక్కులేదు." స్త్రీ కంఠం విసుక్కుంటున్నది.

"ష్ ! గట్టిగా అరవమాకు - బయట ఎవరో వున్నారు ! ఎంత మంది ఉన్నారో - ఏం గొడవో - కరెంటు రానీ !" మొగకంఠం అంటున్నది.

పరంధామయ్యకు బాధ కలిగింది. తన రోజుల్లో అతిథి వస్తే ఆదరించేవాళ్ళు. ఇలా ఎవరైనా వర్షానికి తడిసిపోతూంటే తను సాదరంగా లోనికి ఆహ్వానించేవాడు.

కాలం ఎలా మారిపోయింది! భయం! పరాయి మనిషిని చూస్తే తెగని భయం! అభద్రతా భావం - అన్నిచోట్లా - అందరిలోనూ అభద్రతా భావం !

లోపలినుంచి గుసగుసలు - - వివరం లేని శబ్దాలు -

బయట వర్షం జోరు -

'ఇంట్లో వాళ్ళు కంగారు పడుతూ ఉంటారు - ఊహూ ! వాళ్ళెందుకు పడతారు? పీడా పోయిందనుకుంటారు -

కనీసం తనకూతురు అనసూయ అన్నా గాభరాపడుతుంది - అల్లుడు సంపత్తు

ఎప్పుడూ తన పాలిట విపత్తే! తను వాళ్ళతో ఉండటం అతనికిష్టం ఉండదు. కేవలం తనకు పెన్షన్ వస్తుందన్న ఒకే ఒక కారణంతో ఉండనిస్తున్నాడు - పిల్లలు పెద్దయ్యేదాకా అత్తామామల తోడునీడ అవసరం అయింది - కాని హఠాత్తుగా కాంతం పోయింది గుండె నెప్పితో. ఇంటి చాకిరీ అంతా చేసేది కూతురికోసం. అది పోవడంతో వాళ్ళకి ఒక పనిమనిషి, వంట మనిషి పోయినట్లయింది. తను పెద్దగా ఉపయోగపడడు యిప్పుడు - పిల్లల్ని ఎలాగూ ఆటోవాళ్లు తీసుకువస్తూ ఉంటారు.

తనకు తిండి ఖర్చు దండుగ అనుకుంటారు - కాని తను లేకపోతే వాళ్ళకు ఆ పెన్షన్ చేతికి రాదుగదా !

తను పెన్షన్ యిచ్చిన కొన్ని రోజులు అప్యాయంగానే చూసుకుంటారు - తర్వాత విసుగుతో చూస్తూ ఉంటారు. తను ఏం మాట్లాడినా తప్పే మనవడితో - మనవరాలితో అస్సలు మాట్లాడకూడదు వాళ్ళ చదువులు దెబ్బతింటాయట మరి!

ప్రస్తుతం తను ఎవరికీ కాపట్టని వాడు.

తన ఫ్యామిలీలో తను ఎగ్స్ట్రా మెంబరు!'

అతను నిలబడ్డ వసారా ఇంట్లోంచి గందరగోళంగా అరుపులు - మూలుగులు.

"ఒసే గంగా ! నా పని అయిపోయిందే ! ఊపిరి ఆడ్డం లేదు - చచ్చిపోతా - డాక్టరును పిలవండి !" ఓ ముసలామె చాలా బాధపడ్తూ కేకలు పెడుతున్నది.

" ఈమెకి యిప్పుడే ఆయాసం రావాలా? మన ప్రాణానికి వచ్చింది - కాస్త ఓపిక పట్టండి - ఆ మందులు వేసుకోండి " మగకంఠం విసుగ్గా అరిచింది.

" అయ్యో ! అమ్మ ఏం చేస్తుంది? ఈ వర్షానికి - ఈవాతావరణానికి వచ్చేసింది ఆయాసం ! అమ్మా ! కాస్త కరెంటురానీ అమ్మా !" స్త్రీ గొంతు లాలనగా అంటున్నది. గంగ అయి ఉంటుంది ఆమె.

"ఒసే గంగా ! కరెంటు వచ్చేదెప్పుడు? ఈ వర్షం తగ్గేదెప్పుడు? అప్పటిదాకా బ్రతికి ఉండాలిగా - మందులు ముందే వేసేసుకున్నా ! అయినా ఆయాసం తగ్గలేదు - పెరిగిపోయింది- ఊపిరి ఆడ్డం లేదు - గుండె పట్టేస్తున్నది- అల్లుడుగారు డాక్టరు నన్నా పిలవండి - లేక పోతే నన్ను హాస్పిటల్ కన్నా తీసుకుపోండి - అబ్బా !" అంటూ మంచంమీద పడిపోయిన శబ్దం అయింది.

" అమ్మా ! అమ్మమ్మ పడిపోయినట్లుందే ..."

" ఏవండీ ! చూడండి ఏ డాక్టరునన్నా పిలవండి - లేకపోతే ఆటో పట్టుకురండి–" గాబరా పడుతూ అడిగింది గంగ.

" ఇవ్వాళ ఆదివారం - ఎవ్వరూ దొరకరు - కనీసం ఆటోలు దొరకాలన్నా

అరకిలోమీటరు దూరం పోవాలి ! బయట పెద్ద వర్షం - కరెంటు తీగలు తెగిరోడ్డుమీద పడుంటాయి- ఎక్కడ గుంతలో - ఎక్కడ షాక్ కొడతాయో తెలీదు - థూ థూ ఈ ముసిలాళ్ళతో ఇదే సమస్య ." విసుక్కుంటున్నది మొగకంఠం.

" మీ ఫ్రండు కాంపౌండరు యింజెక్షన్లు యిస్తాడుగా - మనింట్లో యింజెక్షన్లు స్టాకు ఉండనే ఉంటాయిగా - ఆయనకు సెల్లు చేయండి - వెంటనే వచ్చి రెండు సూదులు గుచ్చమని-" గంగ ప్రార్థన.

" నిజమేనే ! అతను షిర్డీకి వెళ్ళాడు. ఇంకా రెండురోజులకు కాని రాడు. స్వంతిల్లని ఊరిబయట కట్టుకున్నాం - ఈ ముసలావిడతో ఎప్పుడూ ఎమర్జెన్సీనే !" అల్లుడు తిట్టుకుంటున్నాడు తమ కర్మకి.

" ఏవండోయ్ ! నూట ఎనిమిదికి గాని నూట నాలుగుకి గాని ఫోన్ చెయ్యండి- అర్జెంటుగా రమ్మని." గంగ చెప్పింది.

ఇంకాసేపు ఏవో మాటలు - గందరగోళం -

" లాభం లేదే ! నా సెల్లులో డబ్బులు అయిపోయాయి. ఔట్‌గోయింగ్ పోవడం లేదు. ల్యాండు ఫోన్ డెడ్ అయింది... బైకు తీసుకని ఆటో కోసం పోయి వస్తాను." అల్లుడు చెబుతున్నాడు.

" కాని బయట దొంగలుంటారు జాగ్రత్త !"

" నిజమే - కాని అత్తయ్యగారున్నారో - పోయారో - మాట పలుకులేకుండా పడిపోయింది - ఈ వర్షానికి బైకు స్టార్టు అవుతుందో లేదో - గొడుగు వేసుకునన్నా పోయిరావాలి!" అల్లుడు భారంగా చెప్పాడు.

ఇంట్లోంచి చిన్నగా బయటకు వెలుతురు పడుతున్నది. దీపారాధన చేసినట్లున్నారు - పరంధామయ్యకు ఆవేదనగా ఉంది. పాపం ! ఆముసలావిడకు ఏమైంది? ఈరాత్రి ఎక్కడికి తీసుకుపోతారు - ఆదివారం అయితే ఎవరూ దొరకరు దానికితోడు వర్షం - కరెంటు లేకపోవడం ఊరిబయట!

దబదబ తలుపు బాదాడు పరంధామయ్య.

" ఎవరు ? ఎవరు ?" కంగారుగా - భయంగా గంగ అరుస్తున్నది.

"గంగమ్మ తల్లి - భయపడమాకు - నేనూ మీలాంటి మనిషినే - తలుపుతీసి నన్ను లోనికి రానివ్వండి - మీకు నేను సహాయం చేస్తాను". పరంధామయ్య గొంతులో ఆప్యాయత రంగరించుకుని చెప్పాడు.

" ఎవడ్రా నువ్వు. ఇంత రాత్రిపూట తలుపు బాదుతున్నావు?" అల్లుడు కోపంగా - కరుగ్గా అరుస్తున్నాడు.

" అమ్మా ! నాకు ఇంజెక్షను యివ్వడం వచ్చు – మీ అమ్మగారికి వెంటనే యింజెక్షను యిద్దామని –" చెప్పాడు పరంధామయ్య.

" నాన్నా ! నాకు భయంగా ఉంది –" పిల్లవాడు చెబుతున్నాడు.

" ఏమండీ ! ఇతనెవరో మన భాగోతం అంతా విన్నట్లున్నాడు – నాక్కూడ భయంగా ఉంది" గంగ చెప్పింది.

" భయమెందుకమ్మా ! నేను కూడా ఇవ్వాళో రేపో రాలిపోయే ముసలి గువ్వను. మిమ్మల్నేం చేస్తాను – కావాలంటే కిటికీ తెరిచిచూడండి–" పరంధామయ్య బాధగా చెప్పాడు.

అల్లుడు కిటికీలోంచి సెల్లు కాంతిని బయటకు ప్రసరింప చేశాడు – అమసక వెలుతురులో బలహీనంగా వున్న ముసలి పరంధామయ్యను చూశాడు. ధైర్యం చేసి తలుపులు తెరిచాడు. చలిగాలి రివ్వున కొట్టింది. గజగజ వణికిపోతూ లోపలికి వచ్చాడు. అల్లుడు వెంటనే తలుపు బిగించాడు. పరంధామయ్య అప్పుడు చూశాడు – అతని చేతిలోని దుడ్డు కర్రను.

" తిక్కవేషాలేస్తే ఒక్క దెబ్బకు ఛస్తావు!" హెచ్చరించాడు అల్లుడు.

చిన్నగా నవ్వాడు పరంధామయ్య "నాకెందుకు బాబు మీ ఆస్తి? నా ఆస్తినే నేను కాపాడుకోలేక పోతున్నాను! తిన్నది అరిగితే చాలు – ఇంతకీ మీ దగ్గర ఏం ఇంజక్షన్లున్నాయి?" అడిగాడు.

" అదిసరే నువ్వెవరివి? డాక్టరువా? కాంపౌండరువా? " అల్లుడు.

" ఏమీ కాదు – కాని నా ఫ్రెండు ఒకడాక్టరు. తోచనప్పుడు ఆయన డిస్పెన్సరీకి వెళ్ళి కూర్చునేవాడిని. అక్కడ కొంత వైద్యం తెల్సుకున్నాను సరదాగా ఇంజెక్షన్లు యివ్వడం కూడా నేర్చుకున్నాను. అత్యవసర సమయాల్లో నాకు నేను, మా పిల్లలకు, ఫ్రెండ్సుకు యింజెక్షన్లు యిస్తూ ఉంటాను".

" ఇంతకీ మీరెవరు – దేవుడిలా వచ్చారు?" గంగ అడిగింది.

" నా పేరు పరంధామయ్య. స్కూలు టీచరుగా చేసి పదేళ్ళ క్రిందట రిటైరయ్యాను – మీ అమ్మను చూపించు –" అంటూ మంచం దగ్గరికి వెళ్ళి ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

ముసిలామె చాలా బలహీనంగా ఉంది. పాము బుసలు లాగా శ్వాస ఉంది. శ్వాస పీల్చడానికి బాగా కష్టపడుతున్నది. .. మగతగా ఉంది.

అల్లుడు ఫ్రిజ్జులోంచి మందుల పెట్టె తెచ్చి అతని ముందుంచాడు. డిస్పోజబుల్ సిరంజీ తీసుకుని, డెక్స్ట్రాన్ లోడ్ చేశాడు – ఆమె నరానికి ఎక్కించాడు – 'అబ్బా!' అని అరచింది.

తరువాత 'డెరిఫిలిన్' ఇంజెక్షను కూడ చేశాడు.

పదినిమిషాలు గడిచాయి.

కరెంటు వచ్చింది.

ముసలామె పరిస్థితి కొంచెం మెరుగా ఉన్నట్లనుకున్నారు గంగ – అల్లుడు – ఎందుకంటే ఆమె నోటివెంట బుసలు లేవు.

పరంధామయ్య ఆమె చెయ్యిపట్టుకుని నాడి చూశాడు –

" సార్ ! అర్జెంటుగా హాస్పిటల్‌కు తీసుకుపోవాలి – పల్సు అందడం లేదు--" కంగారు పడుతూ చెప్పాడు.

గంగ వచ్చి తల్లిని అటుయిటు కదిపి చూసింది– ఆమెలో చలనం కలుగలేదు–.

" మీరు ఆటో తీసుకురండి – నాకు తెల్సిన నర్సింగు హోముకు తీసుకుపోదాం–" పరంధామయ్య చెప్పాడు ఏడుస్తూ.

అల్లుడు బయటకు పోయి – బైకు తీసుకుని వెళ్ళాడు.

పరంధామయ్య పసుపు తెప్పించి ఆమె కాళ్ళకు రాస్తున్నాడు– తేనె నోట్లో పోయమని చెప్పాడు – నిమిషాలు భారంగా దొర్లుతున్నాయి.

పిల్లవాడు బిత్తరపోయి చూస్తున్నాడు.

ఆటో వచ్చింది... అల్లుడు – పరంధామయ్య ఆమెని మోసుకుపోయి ఆటోలో పడుకోబెట్టారు. ఇంటికి తాళం పెట్టి గంగ, పిల్లాడు వచ్చారు. డ్రైవర్ ప్రక్కన పరంధామయ్య – అల్లుడు కూర్చున్నారు.

నాయక్ నర్సింగ్ హోమ్ చేరుకున్నారు.

లక్కీగా డాక్టరున్నాడు.... అతను ఇతనికి తెల్సు –

లోపల బెడ్డుమీద పండుకోబెట్టారు ముసలావిడను –

నాయక్ వచ్చి ఎమర్జెన్సీ యింజెక్షన్లు యిచ్చాడు.

అయినా ఆమెలో ఎటువంటి చలనం లేదు.

బీపీ చూశాడు – కనురెప్పలు తెరిచి చూశాడు– బ్యాటరీ లైటు ఆమె కనుగుడ్లమీద వేసి చూశాడు – ఎటువంటి చలనం లేదు.

" సారీ సార్ ! షి ఈజ్ డెడ్ !" చెప్పాడు నాయక్ భారంగా.

గంగ – పిల్లాడు ఒక్కపెట్టున ఏడ్వడం మొదలెట్టారు.

వారితో పాటు చిన్నపిల్లవాడిలా పరంధామయ్య ఏడ్వసాగాడు.

అల్లుడు కాసేపటికి హాస్పిటల్ అంబులెన్సు తీసుకొచ్చాడు..

డాక్టర్‌కు ఫీజు యిచ్చి బయటకొచ్చాడు.

వార్డు బాయ్‌లు ముసలావిడ పార్థివ కాయాన్ని మోసుకుని అంబులెన్సులో పడుకోబెట్టారు - గంగ పిల్లాడు అంబులెన్సు ఎక్కారు అల్లుడు ముందు కూర్చున్నాడు.

పరంధామయ్య డాక్టరు దగ్గరికి వచ్చాడు - ఏడుస్తూ.

" థ్యాంక్సు నాయక్ గారు - " చెప్పాడు గాద్గదికంగా.

" చూడండి - మీరు అనవసరంగా కేసులో యిరుక్కునేవారు. మీరు తెచ్చినప్పటికే ఆమె చనిపోయింది - కారణాలు మనకు తెలియవు - అమాట చెబితే మీరే చంపేశారని వాళ్ళు మీమీద కేసు పెట్టినా పెడతారు. కొట్టినా కొడతారు - ఎందుకంటే మీకు లైసెన్సు లేదు కాబట్టి. అందుకే మిమ్మల్ని రక్షించాలని కాసేపు ట్రీట్‌మెంటు యిచ్చినట్లు నటించాను - " నాయక్ చెప్పాడు మందలింపుగా.

పరంధామయ్య మరొక్కసారి నమస్కరించి బయటకొచ్చాడు.

బయట అంబులెన్సు అతనికోసం వేచి ఉంది...

" మీరెళ్ళండి - నా దోవన నేను పోతాను - మీ అమ్మగార్ని కాపాడలేక పోయాను -" ఏడుస్తూ చెప్పాడు పరంధామయ్య.

గంగ అంబులెన్సు నుండి దిగింది - అతని పాదాలుతాకింది.

" మీరేం చేస్తారు అంకుల్ ! మీ మంచితనం చాలు - రండి - అంబులెన్సు ఎక్కండి - మీ యింటి దగ్గర దిగబెట్టి వెళతాం ! అంతే కాదు మా అమ్మ గారి అంత్యక్రియలకు రేపు మీరు రావాలి ! మా తండ్రి లాంటి వారు - " ఏడుస్తూ చెప్పింది.

" అమ్మా ! నేను భరించలేనమ్మా ! మీ అమ్మ చావుకు నేను కారణమేమో అనిపిస్తున్నది - ఇంజెక్షన్లు యివ్వకుండా ఉన్నా బాగుండేది ! కేసు పెట్టండి".

" లేదంకుల్ ! మీరు ఫీలు కావద్దు - మీ చేతుల్లో పోవడం ఆమె అదృష్టం పోతూ పోతూ అమ్మ మిమ్మల్ని మాకిచ్చిపోయింది" గంగ చెప్పింది.

పరంధామయ్య ఆఆప్యాయతకు కన్నీళ్ళు కార్చాడు.

" అమ్మా ! బంధాలు త్రెంచుకుని బ్రతుకుదామనుకున్న నన్ను, తిరిగి అనుబంధాలలో బంధిస్తున్నావా? నావాళ్ళనుండే దూరంగా పారిపోదామనుకుంటున్న నన్ను మళ్ళీ బంధించి వెనక్కి తెస్తున్నావు!"

పరంధామయ్యకు కొత్త ఊపిరి వచ్చింది. బ్రతుకుబండి లాగాలంటే అనుబంధం తప్పనిసరి అని అర్థం అయింది అతనికి.

- విశాలాక్షి మాసపత్రిక జులై 2012